సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం ౹ 10 ౹ జనవరి ౹ 2025



దేవాపురంలో ఘనంగా సంక్రాంతి
దేవతలు నడియాడిన ఆధ్యాత్మిక గ్రామంగా చరిత్ర గల దేవాపురంలో సంక్రాంతి పండగకు గిరిజనులు శ్రీకారం చుట్టారు. IIలో



రోగుల ఆకలి కేకలు IIలో
ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో రోగులకు భోజనం సక్రమంగా అందడం లేదు. దీంతో గురువారం వారు ఆవేదనకు గురయ్యారు.



పిల్లల పర్యవేక్షణపై ప్రత్యేక శ్రద్ధ
అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల పర్యవేక్షణపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆర్జేడీ చిన్మయిదేవి సూచించారు. IIలో

న్యూస్‌రీల్

మన్యంలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం
- జి మాడుగులలో 6.4 డిగ్రీల నమోదు



చింతపల్లిలో భారీగా కురుస్తున్న మంచు

చింతపల్లి: మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు మళ్లీ తగ్గడంతో చలి తీవ్రత పెరిగింది. మంచు దట్టంగా కురుస్తోంది. ఏజెన్సీలో గురువారం జి.మాడుగులలో 9.4, డుంబ్రిగుడలో 8.2, అరకువ్యాలీలో 8.4, ముంచంగిపుట్టులో 9.3, పాడేరులో 9.4, చింతపల్లిలో 9.4, హుకుంపేటలో 9.8, పెదబయలులో 10.5, అనంతగిరిలో 11.2 డిగ్రీలు నమోదయ్యాయి. కొయ్యూరులో 12.5 డిగ్రీలు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పల స్వామి తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి చలిగాలులు వీస్తుండటంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు.

పాడేరు సీనియర్ అకౌంటెంట్ సస్పెన్షన్
మహారాణిపేట(విశాఖ): ట్రెజరీలో పని చేస్తున్న ఒక ఉద్యోగిని సస్పెండ్ చేశారు. సీఎఫ్ఎంఎస్‌లో డబుల్ ఎంట్రీ కారణంగా ఒక ట్రెజరీ అకౌంటెంట్‌పై వేటు పడింది. అలాగే డబుల్ ఎంట్రీని సిఫారసు చేసిన సబ్ ట్రెజరీ అధికారి (ఎస్‌టీవో) గణేష్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. పెదబయలు ఎంఈవో జీపీఎఫ్ నిధుల బిల్లును ఒకసారి సీఎంఎఫ్‌లో పెట్టారు. ఇదే బిల్లును మళ్లీ పెట్టడంతో ట్రెజరీ శాఖ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ బిల్లును సీఎఫ్ఎంఎస్‌లో పెట్టిన పాడేరు సీనియర్ అకౌంటెంట్ బెనర్జీని సస్పెండ్ చేసి ఎస్‌టీవో గణేష్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసినట్టు విశాఖ జిల్లా ట్రెజరీ అధికారి (ఇన్‌చార్జి) గోవిందరావు తెలిపారు.

అగ్నివీర్ వాయుసేనలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి
రంపచోడవరం: ఏజెన్సీలోని గిరిజన యువత అగ్నివీర్ వాయుసేనలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని గిరిజన సంక్షేమశాఖ డీడీ విజయశాంతి తెలిపారు. జనవరి 2005, 2008 జూలై ఒకటి మధ్య జన్మించిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు ఏపీఎస్ఐపీఏటీహెచ్‌పీఏవైయూ. సీడీఏసీ.ఐఎన్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.


417 కిలోల గంజాయి పట్టివేత
- వ్యక్తి అరెస్టు



పట్టుకున్న గంజాయితో పోలీసులు

కొయ్యూరు: ఒడిశా నుంచి వ్యాన్‌లో తరలిస్తున్న 417 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ కిషోర్ వర్మ తెలిపారు. గురువారం చీడిపాలెం జంక్షన్ వద్ద వాహన తనిఖీల్లో భాగంగా వ్యాన్‌లో గంజాయిని గుర్తించినట్టు ఆయన తెలిపారు. చాపరాతిపాలెం-బూదరాళ్ల రహదారిలో తీసుకువెళ్తూ పట్టుబడినట్టు ఆయన వివరించారు. ఈ కేసులో స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.20.85 లక్షలు ఉంటుందన్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

11, 12న పలు రైళ్ల రద్దు



తాటిచెట్లపాలెం: దక్షిణ కోస్తా రైల్వే విజయవాడ డివిజన్ రేగుపాలెం-నరసింగపల్లి సెక్షన్ మధ్య జరుగుతున్న నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు ఈ నెల 11వ తేదీన రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈనెల 11న కాకినాడ-విశాఖపట్నం(17267) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-కాకినాడ(17268)ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-పార్వతీపురం(08565) ఎక్స్‌ప్రెస్, పార్వతీపురం-విశాఖపట్నం (08566) ఎక్స్‌ప్రెస్, గుంటూరు-విశాఖపట్నం(17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 12వ తేదీన విశాఖపట్నం-గుంటూరు(17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయి.

సంతలకు సంక్రాంతులు



గుత్తులపుట్టు సంతలో కిరాణా దుకాణాలు



సంతలో దుస్తులు కొనుగోలు చేస్తున్న గిరిజనులు

ఏజెన్సీలో వారపు సంతలు కిటకిటలాడుతున్నాయి. సంక్రాంతి పండగ సందర్భంగా కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఇంటిల్లపాది వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. వచ్చిన ఆదాయంతో తమకు అవసరమైన పండగ వస్తువులు కొనుక్కొని తీసుకువెళ్తున్నారు. గతేడాదితో పోలిస్తే ధరలు బాగా పెరిగాయని గిరిజనులు తెలిపారు.

- మన్యంలో కొనుగోలుదారులతో దుకాణాలు కిటకిట
- పండగ సమీపించడంతో ఊపందుకున్న అమ్మకాలు
- వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలతో ఆదాయం
- అవసరమైన సామగ్రి కొనుగోలు చేస్తున్న గిరిజనులు
- కోళ్లు, మేకలకు రికార్డు ధర
- గుత్తులపుట్టు సంతలో రూ.కోటికి పైగా వ్యాపారం

పండగ వరకు సంతలు జరిగే ప్రాంతాలు
శుక్రవారం: పాడేరు, అరకు, శనివారం: హుకుంపేట, ముంచంగిపుట్టు, ఆదివారం: సుంకరమెట్ట, ధారకొండ, మినుములూరు, వంట్లమామిడి, సోమవారం: అన్నవరం, పెదబయలు, రూఢకోట.



మేకలు, గొర్రెల అమ్మకాలు

సాక్షి,పాడేరు: మన్యంలో వారపు సంతలకు సంక్రాంతి శోభ నెలకొంది. పండగ సమీపిస్తుండటంతో అమ్మకాలు, కొనుగోళ్లతో కళకళలాడుతున్నాయి. గిరిజనులు వ్యవసాయ ఉత్పత్తులను వారపు సంతలకు తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు. వచ్చే ఆదాయంతో పండగ సామగ్రి కొనుగోలు చేసి తీసుకువెళ్తున్నారు. గురువారం పాడేరు మండలం గుత్తులపుట్టు సంతబయలులో జరిగిన వారపు సంతకు పాడేరు, జి.మాడుగుల, పెదబయలు, హుకుంపేట, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన గిరిజనులు భారీగా తరలిరావడంతో కిక్కిరిసి పోయింది.

- గుత్తులపుట్టు సంతలో కాఫీ,రాజ్‌మా, పిప్పలమోడి ఉత్పత్తుల అమ్మకాలు భారీగా జరిగాయి. ప్రైవేట్ వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేశారు. సుమారు రూ.60 లక్షల మేర వ్యాపారం జరిగి ఉండవచ్చని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.
- మేకలు, గొర్రెలు, నాటుకోళ్లకు రికార్డుస్థాయి ధరలు పలికాయి. సుమారు పది కిలోల మాంసం దిగుబడి వచ్చే మేకలు, గొర్రెలను రూ.12 నుంచి రూ.15 వేలకు కొనుగోలు చేశారు. సాధారణ రోజుల్లో వీటి ధర రూ.8 వేలకు మించి ఉండదు. సుమారు రూ.20 లక్షల మేర వ్యాపారం జరిగిందని మాంసం వ్యాపారులు అంచనా వేస్తున్నారు. నాటుకోళ్లకు మంచి ధరలు పలికాయి. కిలో బరువు ఉన్న నాటు కోడిని రూ. వెయ్యి నుంచి రూ.1300 ధరకు కొనుగోలు చేశారు. పెద్ద సైజు కోళ్లు ఒకొక్కదానికి రూ.4వేల వరకు ధర పలికింది.
- గుత్తులపుట్టు సంతలో అన్ని దుకాణాల వద్ద భారీగానే వ్యాపారం జరిగింది. కూరగాయలు, ఇతర నిత్యావసరాలతో పాటు కిరాణ సామగ్రిని గిరిజనులు కొనుగోలు చేశారు. సంతలో సుమారు వంద వరకు వస్త్ర దుకాణాలను వ్యాపారులు ఏర్పాటు చేశారు. వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలతో వచ్చిన ఆదాయంతో గిరిజనులు కొత్త దుస్తులు, పండగ సామగ్రి కొనుగోలు చేసి తీసుకువెళ్లారు.
- గాజులు, ఫ్యాన్సీ, చెప్పుల దుకాణాల్లోను వ్యాపారం భారీగానే జరిగింది. దుస్తులు, కిరాణా కలుపుకుని సుమారు రూ.50 లక్షల వరకు వ్యాపారం జరిగింది. గిరిజనులు సంక్రాంతి పండగకు కొత్త కుండలను కొనుక్కుని ఇళ్లకు తీసుకువెళ్లారు.



రూ.4 వేల ధర పలికిన జత నాటుకోళ్లు

- వాయిద్యాలకు ఉపయోగించే తుడుములను కొంతలి గిరిజనులు విక్రయించారు. గతేడాది తుడుము ధర రూ.3 వేలు ఉండగా, ఈ ఏడాది రూ.3,500కు పెరిగిందని గిరిజనులు తెలిపారు.

ధరలు బాగా పెరిగాయి



గత సంక్రాంతి పండగతో పోల్చుకుంటే నిత్యావసరాలతో పాటు కొత్త దుస్తుల ధరలు బాగా పెరిగాయి. వంట నూనె కిలో బాటిల్ గత సారి రూ.105కు కొన్నా. ఇప్పుడు అదే బాటిల్ రూ.160కు పెరిగింది. దుస్తులు, ఇతర సామగ్రి కొనుగోలుకు రూ.17వేలు ఖర్చయింది.
- కిల్లో కమల, గృహిణి, మఠం కొత్తూరు, హుకుంపేట మండలం

ఆదుకున్న కాఫీ, పిప్పలమోడి



ఈఏడాది సంక్రాంతి పండగకు పిప్పలమోడి, కాఫీ అమ్మకాలు ఆదుకున్నాయి. పిప్పలమోడిని కిలో రూ.320 ధరకు 50 కిలోలు, కాఫీ గింజలు కిలో రూ.270ధరకు 40కిలోలు గుత్తులపుట్టు సంతలో అమ్మకాలు జరిపా.ఈ సొమ్మును సంక్రాంతి పండగ అవసరాలకు ఉపయోగిస్తున్నా.
- వంతాల రామన్న, గిరిజన రైతు, దిగుసోలములు, పాడేరు మండలం

సంతలోనే కొనుగోలు చేశాం



వారపుసంతల్లో గతంలో కన్నా నాణ్యమైన దుస్తులను వ్యాపారులు అమ్మకాలు జరుపుతున్నారు. పెద్ద పెద్ద దుకాణాలకు వెళ్లి ఆవే రకం దుస్తులను అధిక ధరలకు కొనుగోలు చేసి ఇబ్బందులు పడేకన్నా సంతలో బేరం ఆడి కొనుక్కోవడమే మేలు అనిపించడంతో సంతలోనే కొన్నా.
- బి.మధు, గుత్తులపుట్టు, పాడేరు మండలం

కన్నులపండువగా తెప్పోత్సవం



పవిత్ర గోదావరిలో తెప్పోత్సవ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న భక్తులు


- శ్రీరామగిరిలో ఘనంగా వేడుక
- గోదావరి తీరంలో భక్తుల పులకింత

వీఆర్‌పురం (చింతూరు): రెండో భద్రాద్రిగా పేరుగాంచిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీరామగిరిలో శ్రీ సుందర సీతారామచంద్ర స్వామి తెప్పోత్సవ వేడుక అత్యంత కోలాహలంగా గురువారం రాత్రి జరిగింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకకు అశేషంగా భక్తులు తరలివచ్చి స్వామివారిని వీక్షించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సౌమిత్రి పురుషోత్తమాచార్యులు వైకుంఠ ఏకాదశి పర్వదిన విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం సాయంత్రం ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి పల్లకీపై ఆశీనులను చేసి వేద మంత్రాలతో ఊరేగింపుగా పవిత్ర గోదావరి, సంగమ ప్రాంతానికి తోడ్కొని వచ్చారు. అలంకరించిన హంస వాహనంలో సీతారాముల తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు, ఉత్సవకమిటీ, వివిధ శాఖల అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, ఎంపీపీ కారం లక్ష్మి, సర్పంచ్ పులి సంతోష్, తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీవో శోభాషణరావు, సీఐ కన్నపరాజు పాల్గొన్నారు.

నేడు ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి

వెంకన్న ఆలయాలకు వైకుంఠ ఏకాదశి శోభ

సాక్షి,పాడేరు: ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఏజెన్సీలో వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. అనంతగిరి మండలంలోని వైకుంఠగిరి, అరకులోయలోని పురాతన వేంకటేశ్వరస్వామి ఆలయం, పాడేరు పట్టణంలోని ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కొలువైన పద్మావతి సమేత లక్ష్మీ శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప స్వామి ఆలయంలో కొలువుదీరిన కొలువుదీరిన పద్మావతి సహిత వేంకటేశ్వరస్వామి ఏర్పాట్లు పూర్తి చేశారు. వీటితోపాటు సుండ్రుపుట్టులోని అలివేలు మంగమ్మ పద్మావతి సహిత వేంకటేశ్వరస్వామి విగ్రహాలకు వేకువజాము 4గంటల నుంచి ప్రత్యేక పూజలు.అభిషేకాలు జరుగుతాయని అర్చకులు తెలిపారు.



ఐ పోలవరంలోని టీటీడీ ఆలయం

రంపచోడవరం: ఐ పోలవరంలోని టీటీడీ ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తుల ఉత్తర ద్వార దర్శనం కోసం ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రతి నెల రెండో శనివారం ఇచ్చే తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం శుక్రవారం అందుబాటులో ఉంటుందని ఆలయ అధికారి నారాయణరాజు తెలిపారు. అలాగే రంపచోడవరంలోని ద్వారకా తిరుమల దత్తత దేవాలయం నారాయణగిరిపై రంప వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్టు ద్వారకా తిరుమల ఆలయ ఈవో వెంకట సత్యనారాయణమూర్తి తెలిపారు.

టీటీడీ వైఫల్యమే తొక్కిసలాటకు కారణం

- మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి
- మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ డిమాండ్

ముంచంగిపుట్టు: టీటీడీ వ్యవస్థ వైఫల్యమే తిరుపతిలో తొక్కిసలాటకు కారణమని అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందిన ఘటనపై ఆయన స్పందించారు. విదేశీ పర్యటనలో ఉన్న ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు, టీటీడీ అధికారుల నిర్లక్ష్యం వల్లే తిరుపతి ఘటన జరిగిందన్నారు. వైకుంఠ ఏకాదశి టోకెన్ల కోసం ఎక్కువ మంది భక్తులు వస్తారని, అందుకు అవసరమైన భద్రత ఏర్పాట్లు చేయడంలో టీటీడీ అధికారుల విఫలమయ్యారన్నారు. ప్రభుత్వం బాధ్యతారాహిత్యం వల్లే తిరుపతి ఘటన జరిగిందని అన్నారు. ప్రపంచ స్థాయిలో పేరున్న టీటీడీకి చంద్రబాబు హయాంలో అంతులేని నిర్లక్ష్యంగా స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. టీటీడీ ఘటనలో మృతుల కుటుంబాలకు ఒకొక్కరికి రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. టీటీడీ చైర్మన్‌గా బీఆర్‌నాయుడు పదవిలో ఉండే అర్హత లేదని, వెంటనే తొలగించాలని డిమాండ్‌చేశారు. తొక్కిసలాట ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, రానున్న రోజుల్లో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

అంతులేని విషాదం

ఒక్కొక్క కుటుంబానిది ఒక్కో కథ.. అంతులేని వ్యథ.. భగవంతుడి దర్శనంతో తమ జీవితాలు ధన్యమవుతాయని భావించిన వారి విధిని విధాత మరోలా రాశాడు. దైవ దర్శనానికి వెళ్లిన నలుగురు భక్తులు ఊహించని ప్రమాదంలో విగతజీవులుగా మారడంతో ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీలో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన ఆరుగురిలో నలుగురు ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన వారుండటం దిగ్భ్రాంతికి గురిచేసింది. కుటుంబ సభ్యుల మృతితో బాధితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తుంటే.. ఆయా కాలనీల ప్రజల హృదయాలు బరువెక్కాయి. ఈ హృదయ విదారక సంఘటన భక్తుల భద్రతా ఏర్పాట్లపై అనేక ప్రశ్నలను లేవనెత్తింది. ఈ దుర్ఘటన ప్రభుత్వం, టీటీడీ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– సీతంపేట/కంచరపాలెం/మద్దిలపాలెం/నర్సీపట్నం

తిరుపతి తొక్కిసలాట ఘటనలో నలుగురు ఉమ్మడి విశాఖవాసుల దుర్మరణం
ప్రభుత్వ నిర్లక్ష్యంపై మృతుల కుటుంబ సభ్యుల ఆగ్రహం



జీవీఎంసీ 55వ వార్డు, గాంధీనగర్‌కు చెందిన కండిపిల్లి శాంతి, ఆమె భర్త వెంకటేష్, కుమారుడు మహేంద్ర వరప్రసాద్ గోవింద మాలధారణ దీక్ష చేపట్టి, దీక్ష విరమణ కోసం తిరుపతి వెళ్లారు. ఈమె కూడా అక్కడ జరిగిన తొక్కిసలాటలో మృతి చెందారు. కుమారుడు వరప్రసాద్ రోదనలు కలచివేస్తున్నాయి. శాంతి మరణంతో గాంధీనగర్‌లో విషాదచాయలు అలుముకున్నాయి. శాంతి అందరితో మంచిగా ఉండేవారని స్థానికులు గుర్తు చేసుకున్నారు. శాంతి తల్లి కిల్లాడి అప్పలనరసమ్మ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే తన కూతురు మరణించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఇందిరానగర్‌లో ఫొటో పట్టుకుని రోదిస్తున్న శాంతి తల్లి, బంధువు



విషాదంలో నాయుడుబాబు బంధువులు



నర్సీపట్నంలోని పెద్దబొడ్డేపల్లి నివాసి బొడ్డేటి నాయుడు బాబు తీర్థయాత్రకు వెళ్లి.. తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడం ఆ కుటుంబంలో రోదనలు మిన్నంటాయి. ఈ నెల 6న నాయుడుబాబు, అతని భార్య మణికుమారి, నర్సీపట్నం మండలం చెట్టుపల్లికి చెందిన కరణం సత్యనారాయణ, అతని భార్య సంతోషి కలిసి వేంకటేశ్వర స్వామి వైకుంఠ దర్శనానికి వెళ్లారు. ఈ క్రమంలో జరిగిన తొక్కిసలాటలో నాయుడుబాబు మరణించాడు. ప్రమాదం నుంచి మణికుమారిని పోలీసులు రక్షించారు.

జీవీఎంసీ 43వ వార్డు, వెంకటేశ్వర కాలనీకి చెందిన సూరిశెట్టి లావణ్య తన ఆడపడుచు, మరో ముగ్గురు మహిళలతో కలిసి ఈ నెల 5న వైకుంఠ ద్వార దర్శనానికి తిరుపతి వెళ్లారు. టోకెన్ల కోసం క్యూలో ఉండగా జరిగిన తొక్కిసలాటలో ఆమె మృతి చెందారు. భర్త సతీష్ సెవెన్‌హిల్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తల్లి మరణవార్తను పిల్లలకు ఎలా చెప్పాలో తెలియక సతీష్ తీవ్ర వేదనకు గురవుతున్నారు. లావణ్య కాలనీలో అందరితో కలివిడిగా ఉండేవారని, జయవందన డ్వాక్రా గ్రూపునకు అధ్యక్షురాలని స్థానికులు గుర్తు చేసుకున్నారు.



తిరుపతిలో లావణ్య చివరిసారి తీసుకున్న సెల్ఫీ



లావణ్య భర్త సతీష్‌ను ఓదార్చుతున్న కుటుంబ సభ్యులు,బంధువులు

లావణ్య చాలా యాక్టివ్



నేను లావణ్య ఇంటి పక్కనే ఉంటున్నాను. ఆమెతో నాకు చాలా ఏళ్లుగా పరిచయం ఉంది. ఆమె చాలా యాక్టివ్. సరదాగా, అందరితో కలివిడిగా ఉండేది. జయవందన డ్వాక్రా గ్రూపునకు ఆమె అధ్యక్షురాలు. ఎప్పుడూ వైకుంఠ ద్వార దర్శనం చేసుకోలేదు, ఒకసారి వెళ్లాలని ఉందని చెప్పేది. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆమె చనిపోయిందని మంగళవారం అర్ధరాత్రి తెలిసింది. చాలా సేపు నేను ఆ విషయాన్ని నమ్మలేకపోయాను. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. తల్లి లేని బాధను ఆ పిల్లలు ఎలా తట్టుకుంటారో అని ఆలోచిస్తేనే ఏడుపు వస్తోంది. ఆ వెంకటేశ్వరస్వామి ఆ కుటుంబానికి ధైర్యాన్ని ప్రసాదించాలి.

– పప్పీ,
లావణ్య స్నేహితురాలు, వెంకటేశ్వర కాలనీ

మంచి స్నేహితులం



నేను, లావణ్య, పప్పీ ముగ్గురం మంచి స్నేహితులం. లావణ్య చనిపోయిందని తెలిశాక నాకు కాళ్లు చేతులు ఆడలేదు. అందరికీ సహాయం చేస్తుంది. ప్రతి నెలా డ్వాక్రా టీఎల్ఎఫ్ మీటింగ్‌లో కలుస్తుంటాం. కష్ట సుఖాలు మాట్లాడుకునేవాళ్లం. ఈ నెల 26న జరిగిన మీటింగ్‌లో కలిశాం. అప్పుడే తిరుపతి వైకుంఠ ద్వార దర్శనానికి వెళ్తున్నామని చెప్పింది. దేవుడి సన్నిధిలో ఇలా జరగడం చాలా బాధ అనిపించింది. నిన్నటి వరకు మాతో కలిసి ఉన్న లావణ్య ఇప్పుడు లేదంటే మనసుకు కష్టంగా ఉంది.

– సీహెచ్ రమ,
స్నేహితురాలు, వెంకటేశ్వర కాలనీ





భార్య మృతదేహం వద్ద విలపిస్తున్న భర్త లక్ష్మారెడ్డి

మద్దిలపాలేనికి చెందిన గుడ్ల రజనీ(47), ఆమె భర్త లక్ష్మారెడ్డి వైకుంఠ ద్వార దర్శనం కోసం రెండు రోజుల కిందట తిరుపతి వెళ్లారు. టోకెన్ల జారీ సమయంలో జరిగిన ఘటనలో రజనీ మృతి చెందారు. లక్ష్మారెడ్డి ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. వారి కుమారుడు హర్షవర్ధన్ రెడ్డి ఎంఎస్ చదువు కోసం అమెరికాలో ఉన్నారు. కుమారుడి భవిష్యత్తు కోసం రజనీ నిత్యం వేంకటేశ్వర స్వామి, సాయిబాబాకు పూజలు చేసేవారని బంధువులు తెలిపారు. రజనీ పరమ భక్తురాలని, ఆమె ఇల్లు దేవాలయంలా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఆధ్యాత్మిక యాత్రకు వెళ్లి అనంత లోకాలకు వెళ్లిపోయావా అంటూ రజనీ తోటి కోడళ్లు బోరు విలపించారు. కుమారుడి భవిష్యత్‌ను చూడకుండా కన్నుమూసిందని కన్నీపెట్టుకుంటున్నారు. తిరుపతి నుంచి వారు పంపిన ఫొటోలు మొబైల్‌లో చూస్తూ ఆవేదన చెందారు.

క్లుప్తంగా

దేవాపురంలో ఘనంగా సంక్రాంతి

- ఐదు రోజులు ముందుగానే జరుపుకున్న గిరిజనులు
- శంకులమ్మకు ప్రత్యేక పూజలు



గోమాతకు ప్రసాదం తినిపిస్తున్న గిరిజనుడు

సాక్షి,పాడేరు: దేవతలు నడియాడిన ఆధ్యాత్మిక గ్రామంగా చరిత్ర గల పాడేరు మండలం దేవాపురం గ్రామంలో సంక్రాంతి పండగకు గిరిజనులు శ్రీకారం చుట్టారు. గిరిజన సంప్రదాయ ప్రకారం ఐదు రోజులు ముందుగా పండగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా బుధవారం రాత్రి భోగి మంటతో వేడుకలు ప్రారంభించారు. గురువారం ఉదయం సంక్రాంతి పండగను జరుపుకున్నారు. గ్రామచావిడిలోని శంకులమ్మతల్లి రాతి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పులగం, ప్రసాదాన్ని పశువుల శాలలకు తీసుకువెళ్లి పూజలు చేసిన అనంతరం ఆవులు, గొర్రెలు, మేకలు, పాడి పశువులకు తినిపించారు.

ఆస్పత్రిలో సంక్రాంతి సంబరాలు



ఆస్పత్రిలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా

హుకుంపేట: మండల కేంద్రాంలోని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యాధికారి డా. మోహన్ ఆధ్వర్యంలో ముందస్తుగా గురువారం సంక్రాంతి వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమల్‌బాషా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని స్థానిక వైద్యాధికారులు, సిబ్బందితో కలిసి భోగి మంటను కాల్చి సందడి చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో జమాల్‌బాషా మాట్లాడుతు నిత్యం వైద్య సేవల్లో నిమగ్నమై సేవలందించే వైద్యాధికారులు సిబ్బంది ఇటువంటి సంబరాలు నిర్వహించుకోవటం సంతోషంగా ఉందన్నారు. వైద్యాధికారులు శాంతి, సౌజాన్య, విస్తరణ అధికారి సింహాద్రి పాల్గొన్నారు.

జోలాపుట్టు పరివాహకం పర్యాటకానికి అనుకూలం

- ప్రణాళికలు రూపొందించాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

సాక్షి,పాడేరు: ముంచంగిపుట్టు మండలం సుజనకోట ప్రాంతంలో జోలాపుట్టు రిజర్వాయర్ బ్యాక్ వాటర్ వద్ద పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం ఆయన తన చాంబర్‌లో పర్యాటక అభివృద్ధి, చలి అరకు ఉత్సవ్-25పై జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్‌గౌడ, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్‌కలెక్టర్ సౌర్యమన్ పటేల్‌తో సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుజనకోట పంచాయతీ జోలాపుట్టు రిజర్వాయర్ బ్యాక్ వాటర్ ప్రాంతం కేజ్ కల్చర్, ప్యారా సైలింగ్, పర్యాటక అభివృద్ధికి అనుకూలంగా ఉందన్నారు. రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో 350 వరకు గిరిజన మత్స్యకారులు ఉన్నారని, వారితో సొసైటీ ఏర్పాటు చేయాలని సూచించారు. కేజ్ కల్చర్ ఏర్పాటుకు బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేస్తామన్నారు. రూ.5లక్షల పెట్టుబడితో కేజ్ కల్చర్ ఏర్పాటు ద్వారా మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి చెందుతారని, గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని కలెక్టర్ పేర్కొన్నారు.



జేసీ, ఐటీడీఏ పీవోలతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా చలి అరకు ఉత్సవ్

గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా చలి అరకు ఉత్సవ్ 25ను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. సాంస్కృతిక ప్రదర్శనకు అవసరమైన కళాకారుల వివరాలు సేకరించి, రవాణా, వసతి సౌకర్యాలు సమకూర్చాలని ఆదేశించారు. ఫుడ్ కోర్టులు, ఎమ్యూజ్మెంట్, పార్కింగ్, స్టాళ్లు, మొబైల్ టవర్ ఆన్ వీల్స్, మొబైల్ మరుగుదొడ్ల ఏర్పాట్లపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీసు భద్రత చర్యలు చేపట్టాలని, గిరిజన మ్యూజియం, గిరి గ్రామదర్శిని, పద్మాపురం గార్డెన్‌లను సుందరంగా అలంకరించాలని ఆదేశించారు. అరకులోయ పట్టణంలో విద్యుత్ దీపాలు అన్ని వెలిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అరకు మ్యూజియం మేనేజర్ మురళీ, పర్యాటకశాఖ అధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై..

భారత గణతంత్ర వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26వతేదీన పాడేరు తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో గణతంత్ర దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలుజేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలపై శకటాలు,ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయడమే కాకుండా స్వాతంత్ర్య సమరయోధుల వారసులను ఆహ్వానించాలని సూచించారు. డీఆర్వో పద్మలత, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

సామాజిక మరుగుదొడ్లకు ప్రతిపాదనలు

కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

సాక్షి,పాడేరు: స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో సామాజిక మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. తన కార్యాలయం నుంచి ఆర్‌డబ్ల్యూఎస్, జిల్లా పంచాయతీఅధికారి, డీఎల్పీవోలు, ఎంపీడీవోలతో నిర్వహించిన వీడియో సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జన సమూహం అధికంగా ఉన్న ప్రాంతాలు, వారపు సంతలు, నీటి సదుపాయం ఉన్న పర్యాటక ప్రాంతాల్లో సామాజిక మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టాలన్నారు. మరుగుదొడ్లు లేని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించాలన్నారు. పారిశుధ్య పనులకు మంజూరు చేసిన వాహనాలను వినియోగంలోకి తేవాలన్నారు. ఆసక్తి గల వారందరికీ ఉపాధి హమీ పథకంలో ఇంకుడు గుంతలు నిర్మిస్తామన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు అర్జునరావు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ ఆధ్వర్యంలో ఇప్పటికే నిర్మించుకున్న గృహాలకు.పీఎం జన్ మన్‌లోని గృహాలకు వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేస్తామని తెలిపారు. వ్యక్తిగత మరుగుదొడ్లు రూ.12 వేలు, సామాజిక మరుగుదొడ్లను రూ.3లక్షలతో నిర్మిస్తామన్నారు.ఈ సమావేశానికి పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు అభిషేక్, సింహాచలం, అపూర్వ భరత్, డీపీవో లవరాజు, డీఈవో బ్రహ్మాజీరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, డీఎల్పీవో కుమార్, గిరిజన సంక్షేమశాఖ ఇన్‌చార్జి డీడీ రజనీ పాల్గొన్నారు.

రోగుల ఆకలి కేకలు

- సీహెచ్‌సీలో సక్రమంగా అందని భోజనం
- అర్ధాకలితో అవస్థలు
- ఎన్నిసార్లు హెచ్చరించినా పట్టించుకోని నిర్వాహకులు
- సమస్య పరిష్కరించకుంటే ఆందోళనకు దిగుతాం
- విజిలెన్స్ కమిటీ జిల్లా మెంబర్ ప్రసన్నకుమార్ హెచ్చరిక

ముంచంగిపుట్టు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు భోజనం సక్రమంగా అందడం లేదు. దీంతో ఆవేదన గుర్రైన రోగులు గురువారం ఆగ్రహం వ్యక్తం చేశారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ గీతాంజలి, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ ప్రసన్న కుమార్‌దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రిలో 45 మంది రోగులు ఉంటే 25 మందికి మాత్రమే నిర్వాహకులు భోజనం తెచ్చి అందరికీ సరిపెడుతున్నారన్నారు. గుడ్లు, కూర సరిగ్గా ఇవ్వకపోవడమే కాకుండా ఉడకని అన్నం పెట్టడం వల్ల అర్ధాకలితో ఉండాల్సి వస్తోందని వారు వాపోయారు. ఈ సందర్భంగా జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ సానియా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ రోగులకు పెట్టే భోజనంలో నాణ్యత లేకుండా,సక్రమంగా పెట్టకపోవడం చాలా బాధాకరమన్నారు. గతంలో పలుమార్లు రోగులు ఇబ్బందులు పడిన సందర్భాలు ఉన్నా నిర్వాహకుల తీరు మారకపోవడం దారుణమన్నారు. ఈ సమస్యను పరిష్కరించకుంటే ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు. రోగుల ఇబ్బందులను స్థానిక సూపరింటెండెంట్ గీతాంజలి వద్ద ప్రస్తావించగా మెనూ ప్రకారం భోజనం పెట్టాలని నిర్వాహకులను ఆదేశించినట్టు చెప్పారు. రోగుల ఫిర్యాదు మేరకు సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేశామని చెప్పారు. రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ తెలిపారు.

పిల్లల పర్యవేక్షణపై ప్రత్యేక శ్రద్ధ

స్త్రీ, శిశు సంక్షేమశాఖ విశాఖ ఆర్‌జేడీ చిన్మయిదేవి

చింతూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల పర్యవేక్షణపై కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ విశాఖపట్నం రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.చిన్మయిదేవి సూచించారు. ఏజన్సీ పర్యటనలో భాగంగా గురువారం ఆమె మండలంలోని చట్టి-2 అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సదుపాయం ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లేని కేంద్రాల్లో అధికారులతో చర్చించి ఏర్పాటయ్యేలా చూడాలని సూచించారు. కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని, పిల్లల హాజరు, బరువు, ఎత్తు కొలతను శ్రద్ధతో చేపట్టాలని ఆదేశించారు. జీసీసీ నుంచి అందుతున్న సరకుల నాణ్యతను పరిశీలించిన ఆమె ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో న్యూట్రీగార్డెన్ ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో విజయగౌరి, సెక్టర్ ఇన్‌చార్జి కుమారి, దుర్గా ప్రియాంక పాల్గొన్నారు.

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు



దాబాగార్డెన్స్ : సంక్రాంతి పండగను పురస్కరించుకొని విశాఖ నుంచి వివిధ ప్రాంతాలకు రెగ్యులర్ బస్సులతో పాటు ప్రత్యేక సర్వీసులు ఈ నెల 13వ తేదీ వరకు నడపనున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు 20 బస్సులు, రాజమండ్రి, విజయవాడకు 40 సర్వీసులు, కాకినాడకు 20, విశాఖపట్నం నుంచి విజయనగరం, పాలకొండ, పార్వతీపురం, శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, పలాసకు మొత్తంగా 830 బస్సులు నడపనున్నట్టు పేర్కొన్నారు.

20 కోచ్‌లతో వందేభారత్ ఎక్స్‌ప్రెస్

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా విశాఖపట్నం-సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను 20 కోచ్‌లతో నడపనున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖపట్నంలో ప్రతీ రోజు ఉదయం 5.45 గంటలకు బయల్దేరే విశాఖపట్నం-సికింద్రాబాద్(20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్, తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరే సికింద్రాబాద్- విశాఖపట్నం (20834) వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లు ఈ నెల 11వ తేదీ నుంచి 20 కోచ్‌లతో నడుస్తాయి. అప్పటినుంచి ఈ రైలు 18-చెయిర్‌కార్, 2-ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ కోచ్‌లతో నడుస్తుంది. ప్రస్తుతం ఈ వందేభారత్ 16 కోచ్‌లతో నడుస్తుంది.

రెండు ఆటోలు ఢీ: ఒకరు మృతి

కూనవరం: సంక్రాంతి సెలవులకు కూతురు ఐశ్వర్య, కొడుకు రాజేష్ ఇంటికి వస్తున్నారని సంబరపడ్డ ఆ కుటుంబంలో ఒక్కసారిగా విషాదం నెలకొన్నది. చాలా రోజుల తరువాత పండుగ సెలవులను సందర్భంగా కూతురు ఇంటికి వస్తుందని, తానే స్వయంగా వెళ్లి తీసుకు రావాలని, సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకుందామని కలలు కన్న ఆ కుటుంబ పెద్దను మృత్యువు ఆటో ప్రమాద రూపంలో ఆవహించింది. పది రోజుల పాటు ఇళ్లంతా పండగ సందడిని చవిచూడాల్సిన ఆ ఇంట్లో గురువారం విషాదం అలుముకున్నది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పోలీసుల కథనం ప్రకారం మండల పరిధిలోని లింగాపురం పంచాయతీ తాళ్లగూడెం గ్రామానికి చెందిన సోడె దూలయ్య (48), అతని సోదరుడు కలిసి కోతులగుట్ట కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న తమ పిల్లలను ఇంటికి తీసుకొచ్చేందుకు ఆటోలో వెళ్లారు. పాఠశాల ఆవరణలో వారిని ఆటోలో ఎక్కించుకొని ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో కూటూరు సమీపంలోని మలుపు వద్ద ఆగి ఉన్న ఆటోను ఢీ కొట్టడంతో దూలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ని వెంటనే సమీపంలోని కూటూరు పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందిస్తుండగానే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని కోతులగుట్ట సీహెచ్‌సీ తరలించి పోస్టు మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్టు పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ లతశ్రీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు కూతురు ఐశ్వర్య ఇంటర్ ప్రథమం , కొడుకు రాజేష్ చింతూరు ప్రభుత్వ కాళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నారు.



ఆటో ప్రమాదంలో తీవ్ర గాయమైన సోడె దూలయ్య

పోలవరం నిర్వాసితులకు ప్యాకేజీ అమలు

రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ

దేవీపట్నం: పోలవరం ప్రాజెక్ట్ ముంపు బాధితులకు నిబంధనలు ప్రకారం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సబ్ కలెక్టర్ కల్పశ్రీతో కలిసి పోలవరం నిర్వాసితుల సమస్యలపై గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురైన గిరిజనులకు వ్యవసాయానికి అనుకూలమైన భూమి ఇస్తామన్నారు.అలాగే భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ పోలవరం ముంపు బాధితులకు అర్హులైన వారికి పూర్తిస్థాయిలో పరిశీలించి అర్హతను బట్టి ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ సుబ్బారావు, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న పీవో సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ

గంజాయి రవాణా కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు

విశాఖ లీగల్: గంజాయి రవాణా చేస్తున్న ఓ వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ నగరంలోని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం. వెంకటరమణ గురువారం తీర్పు చెప్పారు. ఒక్కొక్కరు రూ.10 వేల జరిమానా చెల్లించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని వెల్లడించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి.ఎస్.ఎన్.వి.ప్రసాద్ రావు అందించిన వివరాలివీ.. నిందితుడు కుక్కల శీను ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్గానగర్‌లో నివాసం ఉంటున్నాడు. 2018 డిసెంబర్ 7న సాయంత్రం మూడు గంటల ప్రాంతంలో శీను ఆరిలోవ సమీపంలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ దగ్గర ఒక వాహనంలో గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అప్పటి పోలీస్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్ నిందితుడిని అరెస్ట్ చేసి, అతనిపై నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు ఇచ్చారు.

టసార్ పట్టుతో గిరిజనుల ఆర్థికాభివృద్ధి

చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్

చింతూరు: టసార్ పట్టు తయారీ కేంద్రం ద్వారా గిరిజనులకు ఆర్థికాభివృద్ధి చేకూరుతందని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ అన్నారు. కూనవరం మండలం పైడిగూడెంలో కొత్తగా నిర్మిస్తున్న టసార్ సిల్క్ తయారీ కేంద్రాన్ని ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన మహిళా సభ్యులతో కలసి గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ టసార్ పంట, ముడి సరకు అభివృద్ధి, టసార్ సిల్క్ బ్రాండ్ కోసం ఈ కేంద్రాన్ని నిర్మించడం జరుగుతుందన్నారు. ఈ కేంద్రం ద్వారా గిరిజన మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు కావాల్సిన యంత్రాలతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని ఆయన ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. చింతూరు ఐటీడీఏ ద్వారా టసార్ సిల్క్ ఉత్పత్తులను తయారుచేసి ఐటీడీఏ లోగో బ్రాండ్‌తో విక్రయించేలా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సభ్యులతో శిక్షణ ఇస్తామన్నారు. టసార్ పంటను డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో విస్తృతంగా పండించేలా సెరికల్చర్ శాఖద్వారా చర్యలు చేపడతామని, నాణ్యతతో కూడిన దారం నుంచి దుస్తులు తయారుచేసేలా మంచి శిక్షణ నిచ్చి జీవనోపాధి మెరుగుపడేలా చర్యలు తీసుకుంటామని పీవో తెలిపారు. డిజైన్ పనులకు సంబంధించి విజయవాడకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ వారితో ఒప్పందానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని పీవో వివరించారు. పైలట్ ప్రాజెక్టు కింద తొలుత 40 మందికి దారం నుంచి బట్టలు తయారుచేసే శిక్షణ ఇవ్వడంతో పాటు ముమ్ముందు సభ్యుల సంఖ్య పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ మహిళా టీం లీడర్ పూజావర్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేడ్కర్, సెరికల్చర్ అధికారి హరికృష్ణ, ఈఈ మురళి పాల్గొన్నారు.



మహిళా సభ్యులతో చర్చిస్తున్న పీవో అపూర్వభరత్

18న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట: జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 18వ తేదీన నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశాలకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, అధికారులు సమావేశాలకు హాజరుకావాలని కోరారు.

పండక్కి ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: పండగ వేళ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు ప్రత్యేక (జనసాధారణ్) రైళ్లు ఆయా తేదీల్లో నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖపట్నం-చర్లపల్లి(08533) జనసాధారణ్ స్పెషల్ విశాఖపట్నంలో ఈ నెల 10,12,15,17వ తేదీల్లో ఉదయం 9.45 గంటలకు బయల్దేరి రాత్రి 10.30 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో చర్లపల్లి-విశాఖపట్నం (08534) జనసాధారణ్ స్పెషల్ ఈ నెల 11,13,16, 18వ తేదీల్లో మధ్యరాత్రి 12.30 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 2.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. విశాఖపట్నం-చర్లపల్లి(08537) జనసాధారణ్ స్పెషల్ విశాఖలో ఈ నెల 10,11,15,16వ తేదీల్లో సాయంత్రం 6.20 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో చర్లపల్లి-విశాఖపట్నం(08538) జనసాధారణ్ స్పెషల్ ఈనెల 11,12,16.17వ తేదీల్లో ఉదయం 10 గంటలకు చర్లపల్లిలో బయల్దేరి అదే రోజు రాత్రి 10గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

నితీష్‌కుమార్ రెడ్డికి ఘన స్వాగతం



నితీష్‌తో సెల్ఫీ తీసుకుంటున్న అభిమానులు

విశాఖస్పోర్ట్స్/గోపాలపట్నం : ఆస్ట్రేలియాలో జరిగిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో అద్భుతంగా రాణించి అందరి దృష్టిని ఆకర్షించిన తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి స్వస్థలమైన విశాఖకు గురువారం చేరుకున్నాడు. విమానాశ్రయంలో ఆయనకు ఘన స్వాగతం లభించింది. కుటుంబ సభ్యులు, అభిమానులు పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో ముంచెత్తారు. పలువురు అభిమానులు ఆటోగ్రాఫ్‌లు, ఫొటోలు తీసుకున్నారు. విమానాశ్రయం నుంచి ఓపెన్ టాప్ వాహనంలో ఇంటికి ర్యాలీగా వెళ్లారు. నితీష్ శనివారం అకాడమిలో శిక్షణకు వెళ్లనున్నాడు. ఈనెల 22 నుంచి ఇంగ్లండ్‌తో జరగనున్న టీ20లు, వన్డే మ్యాచ్‌లకు ఎంపికయ్యే అవకాశం ఉంది.

రంజీల్లో నితీష్

విశాఖ స్పోర్ట్స్: ప్రస్తుత రంజీ సీజన్ లీగ్ మలి దశ పోటీల్లో నితీష్ కుమార్ ఆడనున్నాడు. ఆంధ్ర ఆరో రౌండ్‌లో పుదుచ్చేరితో తలపడనుండగా... చివరి మ్యాచ్‌లో రాజస్థాన్‌తో తలపడనుంది. ఈ రెండు మ్యాచ్‌ల్లోనూ ఆంధ్ర తరపున నితీష్ ఆడనున్నాడు. ఈనెల 23 నుంచి జరగనున్న మ్యాచ్‌ల్లో నితీష్ ఆడనుండటంతో జట్టుకు మిడిలార్డర్‌లో కీలకంగా మారనున్నాడు. గుజరాత్‌తో ఆడిన మ్యాచ్‌లో 29 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన స్థితిలో భరత్‌తో కలిసి ఆరో వికెట్‌కు 137 పరుగులు జోడించాడు. ఫాలోఆన్ ఆడిన ఆంధ్ర రెండో ఇన్నింగ్స్‌లోనూ నితీష్ లోయర్ మిడిలార్డర్‌లో నిలకడగా ఆడాడు.

విద్యాలయాల్లో వేడుకగా సంక్రాంతి సంబరాలు

సందడి చేసిన విద్యార్థులు



రంపచోడవరం కళాశాలలో సంక్రాంతి సంబరాలు

అరకులోయటౌన్: జిల్లాలోని విద్యాలయాల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను గురువారం జరుపుకున్నారు. విద్యార్థులు సంప్రదాయ పద్ధతిలో వస్త్రాలను ధరించి సంబరాలను అట్టహాసంగా మొదలు పెట్టారు. కళాశాలలో భోగి మంటను ఏర్పాటు చేశారు. కళాశాల ప్రాంగణం, మైదానాలను రంగు రంగుల ముగ్గులతో అలంకరించారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులతో కలిసి భోగి మంటల వెలుగులో థింసా నృత్యాలు చేశారు. హరిదాసు వేషంలో విద్యార్థులు చేపట్టిన కార్యక్రమం అందరినీ ఆకట్టుకున్నాయి. ముగ్గుల, ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. గాలిపటాలను ఎగురవేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ

భావితరాలకు ఉపయోగపడేలా సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించే బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. అందరికీ సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలిపారు.

అరకులోయలోని బివికే పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: చింతపల్లి డిగ్రీ కళాశాలలో జరిగిన వేడుకలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి, అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసపాత్రుడు, డాక్టర్ కెజియారాణి, లీలాపావని, జగదీష్, సంతోషి పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలోని జర్రెల గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వేడుకలను సంప్రదాయ రీతిలో ఘనంగా జరిపారు. గ్రామస్తులు ఈ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు.

సీలేరు: స్థానిక డీఏవీ పాఠశాల, జెడ్పీ హైస్కూల్, బాలికల ఆశ్రమ పాఠశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ శిక్షణ కళాశాల (డైట్ కళాశాల)లో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ చినబాబు, అధ్యాపకులు, సిబ్బంది సూర్యనారాయణ, డాక్టర్ జి.భాస్కర్‌రావు, వెంకటలక్ష్మి, సామ్రాజ్యం, బాపిరాజుదొర అపర్ణ, సిద్ధార్థ పాల్గొన్నారు.

చింతూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకలో హెచ్‌ఎం బాలకృష్ణ , ఉపాధ్యాయులు స్వాతి, రమేష్, పెంటమ్మ, నాగరాజు, సుజాత, రత్తయ్య, సుబ్బయ్య, మహాలక్ష్మి, జయ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: జడ్డంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకలో హెచ్‌ఎం రాజు, ఉపాధ్యాయులు దేవుడమ్మ, సింహాద్రిరావు, బాలబ్బాయి, భగవాన్, మూర్తి, వెంకన్న, వసంత, పద్మావతి, పీఈటీ చిన్నారావు, పాఠశాల చైర్మన్ మల్లేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



అరకులోయలోని పాఠశాలలో వేడుకలు



చింతూరులో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



జడ్డంగి జెడ్పీ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు